
నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, ఆదివారం 1 డిసెంబర్ 2024 | VIKARABAD



పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

## నిధుల రద్దుతో ఆగిన అభివృద్ధి

**పెండింగ్ పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలి**

**మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వినతి**

బడంగ్‌పేట, నవంబర్ 30: మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.69 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపనలు చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పలు అభి వృద్ధి పనులను నిలిపి వేశారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మంత్రి శ్రీధర్ దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గవ్యా ప్తంగా మధ్యంతరంగా ఆగిపోయిన పనుల వివరాలను వివరిస్తూ.. వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రద్దు చేయడం వల్ల మధ్యంతరంగా పనులు ఆగిపోయాయని ఆమె తెలిపారు. పెండింగ్ పను లను పూర్తి చేసే విధంగా నిధులు మంజూరు చేయించాల న్నారు. చాలా చోట్ల బస్తీ దవాఖానలు, సమీకృత మార్కెట్ల పనులు నిలిపివేశారని తెలిపారు. గత ప్రభుత్వం రాజకీ యాలకు అతీతంగా పనిచేసిందని గుర్తు చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్య క్రమంలో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగి రింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు సూర్ణ గంటి అర్జున్, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, బండారు మనోహర్, ఎర్ర మహేశ్వరి జైయిం తది తరులు పాల్గొన్నారు.

## ఓటీఎస్ అట్టర్‌ఫ్లాప్

**ముగిసిన గడువు-రెండు నెలల సమయం ఇచ్చిన ఫలితమివ్వని వైనం**

**రూ.1255కోట్ల లక్ష్యం. వచ్చింది రూ.110కోట్లే**

సిటీబ్యూరో, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ ) : దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను వసూలు చేసేందుకు జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ ( ఓటీఎస్) పథకం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రెండు నెలల పాటు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా..శనివారంతో ఈ గడువు ముగిసింది. కేవలం దాదాపు లక్షకు పైగా ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోగా, కేవలం రూ.110కోట్లు మాత్రమే ఆదాయాన్ని సమకూర్చుకున్నది. వాస్తవంగా డొమెస్టిక్, డొమెస్టిక్ స్లమ్, కమర్షియల్, ఇండస్ట్రీయల్, ఎంఎస్‌బీ, బల్క్, కాలనీలు, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థలు కలిపి 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తింపు కాగా.. వీటి నుంచి రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని జలమండలి అంచనా వేసింది. ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానున్నది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా ఓటీఎస్‌ను డివిజన్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినా ఫలితం లేదు.. దీనికి కారణాలు లేకపోలేదు.ఓటీఎస్ జీవో వెలువడిన తర్వాతనే జలమండలి విధి విధానాలు రూపొందించి దాదాపు 17 రోజుల పాటు సమయం తీసుకున్నది. దీనికితోడు దసరా, దీపావళి జంట పండగలు వచ్చాయి. 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఎక్కువ శాతం సిబ్బంది సమయం కేటాయించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కరువైంది. అన్నింటికంటే ముందు అఫిడవిట్, సెల్ఫ్ డిక్లరేషన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. మొత్తంగా గతంలో దాదాపు ఓటీఎస్ రూపంలో రూ. 250కోట్లకు పైగా ఉంటే ఈ సారి మాత్రం జలమండలి రూ.110కోట్లకే సరిపెట్టుకున్నది. కాగా ఓటీఎస్ సద్వినియోగం చేసుకోని వారి నల్లా కనెక్షన్లను తొలగిస్తామన్న జలమండలి హెచ్చరికలు జారీ చేస్తుండడం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

## 'హైడ్రా' పైగా ప్యాలెస్‌కు..

**ఈ నెలలో ఆఫీసును తరలించే ప్రయత్నం..త్వరలోనే హైడ్రా పీఎస్**

సిటీబ్యూరో: బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయం మరో ప్రాంతానికి మారనున్నది. బేగంపేటలోని పైగా ప్యాలెస్‌ను హైడ్రాకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. డిసెంబర్ నెలాఖరులోగా కార్యాలయాన్ని మార్చడానికి హైడ్రా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న హైడ్రాను ఇప్పుడు బేగంపేటకు మారుస్తుండడం, ఓఆర్‌ఆర్ లోపల చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్న హైడ్రా కార్యాలయం కూడా చెరువు హద్దుల్లోనే ఉందని మరి దీన్ని ఎలా చూడాలంటూ పెద్ద ఎత్తున విమ ర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం హైడ్రాను మరోచోటికి మార్చడానికి నిర్ణయం తీసుకుంది. ఇక త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యా దులను వెంటనే పరిశీలిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాలయా నికి ప్రతిరోజూ 30 నుంచి 40 ఫిర్యాదులొస్తున్నాయని సమాచారం. వీటిని పరిశీలించడమే పెద్ద పని కాగా.. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడం మరింత తలనొప్పిగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే హైడ్రాకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి సంబం ధిత ఫిర్యాదులపై స్పందించే అవకాశం ఉంటుందని రంగనాథ్ చెప్పారు.

### అప్పులు మీదపడుతున్నయ్..



కౌలు డబ్బులు చెల్లించి, పెట్టుబడికి అప్పులు చేసి వ్యవసాయం చేస్తే అప్పులే మీదపడుతున్నయ్. వ్యవసాయంపై ఆధారపడి బతికే మాకు.. వేరే పని చేయలేక వ్యవసాయంతోనే పోరాడుతున్నం. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల్లోకి రానివ్వడం లేదు. మండలంలో కౌలుదారు సర్టిఫికెట్ తీసుకురమ్మంటున్నరు. తీరా సర్టిఫికెట్ తీసుకొచ్చాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకోకుండా భూమి పాస్‌బుక్, బ్యాంకు ఖాతా అంటూ గోస పెడుతున్నరు. ఎంతకో అంత అని మధ్య దళారులకు పంటను అమ్ముతున్నం. తక్కువ ధరకే కొనుగోలు చేసి మా శ్రమను దోచుకుంటున్నరు. మా రెక్కల కష్టమంతా వడ్డీవ్యాపారులకే సరిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకుని న్యాయం చేయాలి.

– కట్ట యాదయ్య, నల్లచెరువు



- ధాన్యాన్ని అమ్ముకునేందుకు పడరానిపాట్లు
- కౌలుదారు సర్టిఫికెట్ ఉంటేనే కొనుగోలు కేంద్రాల్లోకీ అనుమతి
- తప్పనిసరి పరిస్థితుల్లో మధ్య దళారులకే పంట విక్రయం
- ఇటు కౌలు, అటు పెట్టుబడి పోను మిగిలేది అంతంతే..
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- జిల్లావ్యాప్తంగా 30 వేల నుంచి 40 వేల మంది కౌలురైతులు

# కష్టాల్లో కౌలు రైతు



**జిల్లావ్యాప్తంగా 3.25 లక్షలకు పైగా రైతులు ఉండగా, వీరిలో సుమారు 30 వేల నుంచి 40వేల మంది కౌలు రైతులు ఉన్నారు. పండిం చిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కౌలు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటు కౌలు డబ్బులు చెల్లించి, పెట్టుబడికి అప్పులు చేసి, తీరా పంట చేతికొచ్చాక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పత్తి, వరికి మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటున్నది. రైతులు పంటను అమ్ముకోవాలంటే భూమి పాస్‌బుక్కు, బ్యాంకు పాస్ బుక్కులు తప్పనిసరి చేసి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కౌలు రైతులకు పాస్‌బుక్కులు లేకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తీసుకోవడంలేదు. ఒకవేళ ధాన్యాన్ని అమ్ముకోవాలంటే మండల వ్యవసాయాధికారి లేదా మండల వ్యవ సాయ విస్తరణాధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ సర్టిఫికెట్లను కొన్ని కేంద్రాల్లో అనుమతిస్తుండగా, మరికొన్ని కేంద్రాల్లో అనుమతించకపోవడంతో కౌలు రైతులు మధ్య దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. భూమి యాజమాని పాస్‌బుక్కు ద్వారా అమ్ముకుందామన్నా తమ డబ్బులు వారి ఖాతాల్లో జమవుతాయి కాబట్టి వారు తిరిగి డబ్బులు ఇస్తారో లేదోనన్న అయోమయంలో ఉన్నారు. తప్పని పరిస్థితిలో అధిక శాతం మంది కౌలు రైతులు దళారులకే పంటను విక్రయిస్తున్నారు.**

**- రంగారెడ్డి, నవంబర్ 30 (నమస్తేతెలంగాణ)**

### పంట కొనేందుకు కొర్రీలు..



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాలంటే అధి కారులు నానా కొర్రీలు పెడుతున్నారు. కౌలుకు భూమి తీసు కుని సాగు చేస్తున్నందున దానికి సంబంధించి సర్టిఫి కెట్ తీసుకోవాలని తిప్పుకుంటున్నారు. తీరా సర్టిఫి కెట్ తీసుకెళ్తే కొన్ని కొనుగోలు అనుమతించకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కౌలు రైతులను పట్టించుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా.

– లింగంగౌడ్

### దళారులకే అమ్మాల్సి వస్తున్నది..



కొనుగోలు కేంద్రాల్లో కౌలు రైతుల ధాన్యాన్ని తీసుకోకపోవడంతో దిక్కు లేక దళారులకే పంటను అమ్ముకో వాల్సి వస్తున్నది. కౌలు చెల్లించి, పెట్టుబడికి అప్పులు చేశాం. తక్కువ ధరకే అమ్ముకున్నాం. ఎవుసానికి అయిన ఖర్చు కూడా రాక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఉన్న రైతులనే పట్టించుకుంటుందా.. మాలాంటి కౌలు రైతు లకు దిక్కేది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– అంజయ్య, నల్లచెరువు



## రేవంత్‌రెడ్డి పాలనలో ఆసరా పింఛన్లు రాక భిక్షాటన

**భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్**

వికారాబాద్, నవంబర్ 30 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి నెలా ఆసరా పింఛన్లు సకాలంలో రాక తాము భిక్షాటన చేయాల్సిన పరిస్థితి దాపురించిందని భారత దివ్యాంగుల హక్కుల పరి రక్షణ సమితి రాష్ట్ర అధ్య క్షుడు గిద్దె రాజేశ్ మండిపడ్డారు. శనివారం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనను నిరసిస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నియోజకవర్గం వికారాబాద్‌లోని రైల్వే జంక్షన్‌లో సంఘం నేతలతో కలిసి వినూత్న రీతిలో భిక్షాటన చేసి పాలన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీలోపే ఆసరా పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు రాష్ట్రంలో ఏడాది నుంచి కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వివిధ రకాల పింఛన్‌దారులకు పింఛన్లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో త్వరలోనే తమ సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ మూడోసారి ముఖ్య మంత్రి అయ్యుంటే తమ సమస్యలు పరిష్కారమయ్యేవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులను పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, సంఘం జిల్లా నాయకులు రవీందర్, ధారూరు, వికారాబాద్ టౌన్, పరిగి, దోమ మండలాల అధ్యక్షులు బాలరాజు, గణేశ్, చంద్రయ్య, సుక్కయ్య, నాయ కులు అనిల్, నరసింహులు, నారాయణ, నరేశ్, జంగయ్య, రాజు తదిత రులు పాల్గొన్నారు.



వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో భిక్షాటన చేస్తున్న దివ్యాంగులు



అర్కెతల గ్రామంలో పేరుకుపోయిన చెత్త

- పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తం
- నిధులు లేక గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు
- ఎనిమిది నెలలుగా పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- డీజిల్‌కు కూడా డబ్బులు లేక మూలన పడిన ట్రాక్టర్లు
- పైప్‌లైన్ లీకేజీలు, వీధి దీపాలు లేక చీకట్లు
- అధ్వానంగా మారిన పారిశుధ్యం

# నాడు స్వచ్ఛ పల్లెలు నేడు మురికి కూపాలు

వికారాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దుకున్న పల్లెల్లో పాలన పడకేసింది. 'పల్లె ప్రగతి'తో దేశంలోనే ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేసు కుని అవార్డులను సొంతం చేసుకున్న గ్రామాలు ఏడాదిలో కాలంలోనే అస్త వ్యస్తంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా నిధులు రాక సమస్యలు పేరు కుపోయాయి. గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తూ వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో సమస్యలను పట్టించుకోకుండా ఎనిమిది నెలలుగా ప్రత్యే కాధికారుల పాలనను కొనసాగిస్తున్నది. కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచి పోవడం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్త కుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. చిన్న చిన్న కాంట్రాక్టర్లతో చేయించిన పనులకే ఇవ్వాల్సిన రూ.4 కోట్ల నిధులు రాకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచా యతీలు ఆదర్శంగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని పల్లెజనం ఆరోపిస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా పంచాయతీ కార్మికులకూ జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పంచాయతీల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కనీసం డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతు కూడా చేయలేని పరిస్థితి నెలకొన్నది. బీఆ ర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అద్దంలా మెరిసిన పల్లె రోడ్లు.. ప్రస్తుతం మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీలతో దుర్గంధంగా మారాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు వ్యాధుల బారినప డుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు మూలన పడ్డాయి. ట్రాక్టర్లకు ఈఎంఐ కట్టకపోవడంతోపాటు కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి దాపురించింది. దీంతో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే ప్రక్రియ నిలిచిపోయింది. ఏ గ్రామాన్ని చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నది. ఇండ్ల మధ్యలోనే చెత్త కుప్పలతో డంపింగ్ యార్డులను తలపిస్తు న్నాయి. మరికొన్ని గ్రామాల్లో అయితే కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేకపోతుండడం గమనార్హం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 29 గ్రామ పంచాయతీలు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులను సొంతం చేసుకుని దేశంలోనే ఆదర్శ పంచాయ తీలుగా గుర్తింపు పొందగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడా దిలోపే ఆధ్వానంగా మారడం గమనార్హం.





నవాబుపేట మండలం కుమ్మరిగూడెం గ్రామంలో మూలకుపడిన ట్రాక్టర్, చెత్తకుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తున్న ఓ వీధి